క్లుప్తంగా

బ్రాహ్మణదొడ్డిలో రెవెన్యూ సదస్సు

సి.బెళగల్: మండల పరిధిలోని బ్రాహ్మణదొడ్డిలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని సచివాలయంలో వీఆర్వో మంజీర రెవెన్యూ సదస్సు నిర్వహించగా మండల రెవెన్యూ అధికారులతో కలిసి తహసీల్దార్ వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ పరిధిలో అధికారులు చేపట్టిన భూముల రీ సర్వే పత్రాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ రైతులకు 9(2) నోటీస్‌లను అందజేశారు. అనంతరం రైతుల భూ సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలను తెలిపారు. రీసర్వే డీటీ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్ఏలు, రైతులు ఉన్నారు.

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనీస్

సి.బెళగల్: గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పోలకల్ పీహెచ్‌సీ డాక్టర్ అనీస్ సూచించారు. ఆయన మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో వైద్య అధికారులతో కలిసి గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఐరన్ మాత్రలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. గర్భిణులలో హైరిస్క్, రక్తహీనత లక్షణాలపై డాక్టర్ అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ ఖాజామియ్యా, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు(రూరల్): నగర సమీపంలో వెంకాయపల్లె గ్రామ సమీపాన వెలసిన ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. మొక్కుబడి ఉన్న భక్తులు బోనం కుండలను బంతిపూలతో అలంకరించి నియమనిష్ఠలతో తలపై ఉంచుకొని అమ్మవారి దర్శనానికి క్యూ కట్టారు. కుంకుమార్చన, ఆకుపూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యంగా భక్షాలు, గుగ్గిళ్లు, పిండి వంటలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నాగులకట్ట వద్ద నూతన దంపతులు, మహిళలు, యువతులు ప్రత్యేక పూజలు చేశారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



టిప్పర్‌ను ఢీకొన్న లారీ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైవే పోలీసుల వివరాల మేరకు.. ఎస్సార్బీసీ కాల్వ–జంబులాపరమేశ్వరి ఆలయం మధ్యనున్న యూటర్న్ వద్ద ఓ టిప్పర్ ఆగి ఉండగా, నెల్లూరు నుంచి గద్వాల్‌కు ఆయిల్ లోడుతో వెళ్తున్న మినీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ లారీ డ్రైవర్ చిన్నయ్య, టిప్పర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. అనంతరం రహదారిపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాలను పక్కకు తరలించారు.

అధ్యాపకుడికి సన్మానం



సయ్యద్‌బాబును సన్మానిస్తున్న తోటి అధ్యాపకులు

పాణ్యం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న సయ్యద్‌బాబు ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకుడి అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటరామన్ నేతృత్వంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. తోటి అధ్యాపకులు ఆయనకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. అభినందనలు తెలిపారు. మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

- అన్నదాతలను దగా చేస్తున్న చంద్రబాబు సర్కార్
- యూరియా కోసం పడిగాపులు
- ఆత్మహత్యకు యత్నించిన రైతులపైనే కేసులు పెట్టడం సిగ్గుచేటు

రైతాంగ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



అన్నదాత పోరు ర్యాలీలో పాల్గొన్న ఎస్వీ మోహన్‌రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి, బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్, కోట్ల హర్ష, అహ్మద్ అలీఖాన్, విజయమనోహరి, సిద్ధారెడ్డి రేణుక తదితరులు



కర్నూలు ఆర్‌డీఓ కార్యాలయ ఏఓ వేణుగోపాల్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కర్నూలు (టౌన్): రైతాంగ సమస్యలు పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతుందని, వారి సమస్యలు పరిష్కరించే వరకు రైతులతో కలిసి వైఎస్సార్‌సీపీ పోరుబాట కొనసాగుతుందని ఆ పార్టీ కర్నూలు పార్లమెంటు పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జిల్లాలోని కర్నూలు, పత్తికొండ, ఆదోని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. స్థానికంగా రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీలు నిర్వహించారు. కర్నూలులో పార్టీ శ్రేణులు మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పార్టీ జెండాలు చేతబట్టి 'సీఎం డౌన్.. డౌన్', 'ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి', రైతులను ఆదుకోవాలన్న డిమాండ్లతో కూడిన ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కర్నూలులో వైఎస్సార్ సర్కిల్ నుంచి పాత పోలీసు కంట్రోల్ రూమ్, కొండారెడ్డి బురుజు, ఆర్‌డీఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. వరి, ఉల్లి పైరు, యూరియా సంచులను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. ఆదోని పట్టణంలో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూధన్, పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్‌డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. అలాగే పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించి ఆర్‌డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్‌డీవో కార్యాలయం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంటు పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతు సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులపై కేసులు పెట్టిన ప్రభుత్వానికి పోయే కాలం దాపురించిందన్నారు. కర్నూలు మేయర్ బీవై రామయ్య, పార్టీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ మాట్లాడారు. అనంతరం పార్టీ నేతలు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పరిపాలన అధికారి వేణుగోపాల్‌కు రైతు సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వంగాల భరత్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయమనోహరి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిద్దారెడ్డి, రేణుక, నగర అధ్యక్షుడు అహమ్మద్ అలీఖాన్, యువత అధ్యక్షుడు శివారెడ్డి, హనుమంతరెడ్డి, తిరుమలేశ్వర రెడ్డి, సిట్రా సత్యనారాయణమ్మ, కల్లా నాగవేణి రెడ్డి, కార్పొరేటర్లు మునెమ్మ, అరుణ, పల్లవి, షేక్ అహమ్మద్, జుబేర్, షాషావలీ, పార్టీ నేతలు షరీఫ్, రాఘవేంద్ర నాయుడు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ తదితరులు

కోడుమూరు రూరల్: ఫ్లోరోసిస్ వ్యాధిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్ సూచించారు. గూడూరు మండలంలోని కె.నాగలాపురం ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. ఫ్లోరోసిస్ వల్ల దంతాల మీద పసుపు రంగు గీతలు ఏర్పడడంతో పాటు, చిగుళ్ల మధ్య నల్లగా మారడం, దంతాలు గుంటలుగా ఏర్పడి ఆహారాన్ని నమలలేని పరిస్థితికి చేరుకుంటారన్నారు. ఎముకలు పెలుసుగా మారి వైకల్యానికి దారితీస్తుందని వివరించారు. ఫ్లోరోసిస్ నివారణకు రక్షిత మంచినీటిని సేవించడం ఒకటే మార్గమని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఇమాంహుసేన్, వైద్య సిబ్బంది ఉమామహేశ్వరి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రత మనందరి బాధ్యత



కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

ఓర్వకల్లు: పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ఉయ్యాలవాడ గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీలో ఇంటింటి చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ నాయక్‌తో కలిసి పలు వీధులను సందర్శించి, మురుగు కాల్వలు, రోడ్లపై నిల్వవున్న మురుగునీరు, చెత్త పరిస్థితిని పరిశీలించారు. కాలనీ వాసులతో మాట్లాడి, చెత్త సేకరణ వాహనం సమయానికి వస్తుందా లేదా? ఎన్ని రోజులకు ఒకసారి వస్తుంది? అనే విషయాలను ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ చెత్తను పంచాయతీ వారు ఏర్పాటు చేసిన చెత్త బండ్లలో వేయాలని సూచించారు. రానున్న రోజుల్లో సీఆర్‌పీలుగా ఎంపికైన పొదుపు సభ్యులు తడి చెత్త–పొడి చెత్త వేరు చేయడంపై ఇంటింటికి అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఓర్వకల్లు మండలం జిల్లాలో చెత్త సేకరణ కార్యక్రమంలో ఆరో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రతి కాలనీ పరిశుభ్రంగా ఉండేలా సహకారం అందించాలని ప్రజలను కోరారు. స్థానిక నాయకులు రమణారెడ్డి, మాదన్న, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కల్లూరు: ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి అన్నారు. మంగళవారం పుసులూరు గ్రామంలో జరుగుతున్న చెత్త సేకరణ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా అందించాలని ప్రజలకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మహిళల ప్రగతి కోసం ప్రత్యేక ప్రణాళికలు



మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు

కల్లూరు: మహిళల ప్రగతి కోసం ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రచించి, చిత్తశుద్ధితో అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, ఉమా అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 31, 32వ వార్డుల్లోని శరీన్‌నగర్, ముజఫర్‌నగర్‌లలో మహిళా సంఘం (ఐద్వా) సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ దేశంలో మహిళలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సమాన అవకాశాలు ఉన్నాయో ఆ దేశాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. నేటికి సమాజంలో మహిళలకు భద్రత లేదన్నారు. మహిళా ప్రగతికి ఎంతో ఉపయోగపడే పొదుపు రుణాలకు సున్నా వడ్డీ పథకం అమలు చేయకపోవడం వల్ల మహిళల్లో అసంతృప్తి పెరిగిందన్నారు. మహిళలు చైతన్యవంతులైతేనే సమాజ పురోగతి సాధ్యపడుతుందన్నారు.

బస్సుల కోసం పడిగాపులు



పాణ్యం బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యం బస్టాండ్‌లో మంగళవారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతపురంలో జరగనున్న సీఎం చంద్రబాబు సభకు పెద్దఎత్తున బస్సులను తరలించడంతో, స్థానికంగా బస్సుల సంఖ్య తగ్గిపోయింది. సమయానికి బస్సులు రాకపోవడంతో పాటు, వచ్చిన బస్సులు కూడా కిక్కిరిసిపోయాయి. దీంతో బస్టాండ్‌లో గంటల తరబడి వేచి చూసిన ప్రయాణికులు ఎక్కేందుకు తీవ్ర అగచాట్లు పడ్డారు. మధ్యాహ్నం నుంచి అనేక బస్సులను అనంతపురంకు మళ్లించడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని ప్రయాణికులు తెలిపారు.

ఆడ పిల్లలను సంరక్షించాలి

కర్నూలు(రూరల్): ఆడపిల్లను పుట్టనిద్దాం.. బతకనిద్దాం.. చదవనిద్దాం.. ఎదగనిద్దాం అని జిల్లా డెమో శ్రీనువాసులు శెట్టి గర్భిణులకు సూచించారు. మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట ప్రకారం నేరమన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానమేనని, లింగ వివక్ష ఉండరాదన్నారు. స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారని వివరించారు. ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనోజ్‌కుమార్, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ నర్స్ నిర్మలాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డెమో శ్రీనివాసులు శెట్టి

ఫ్లోరోసిస్‌పై అవగాహన

కల్లూరు: ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల కలిగే సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎ.గోకులపాడు గ్రామ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ ఫ్లోరోసిస్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు, వంటకు ఉపయోగించే నీటిలో ఫ్లోరైడ్ మోతాదు సరిగా లేకపోతే అనేక సమస్యలు వస్తాయని వివరించారు. అధిక ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల దంతాలు పసుపు లేదా గోధుమ రంగులోకి మారడం, చిగుళ్ల మధ్య నల్లగా కనిపించడం, కిడ్నీ వ్యాధులు, ఎముకలు వంగిపోవడం, కీళ్ల నొప్పులు, కండరాల బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. దంత సమస్యలు నివారించుకోవాలంటే ఉదయం, రాత్రి రెండు పూటలా బ్రష్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హనుమంతు, సుబ్బయ్య, చాముండేశ్వరి, చందన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఓర్వకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, రాబోయే మూడు నెలలకు సంబంధించిన అభివృద్ధి పనులకు అవసరమైన ప్రగతి నివేదికలతో ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని కె.నాగలాపురం ప్రాథమిక పాఠశాల, పెంచికలపాడు హైస్కూల్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి తనిఖీ చేశారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని, ఉపాధ్యాయులు ఆ విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కె.నాగలాపురం పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండటాన్ని గమనించి ఇకపై గ్యాస్ పొయ్యిపై మాత్రమే వంట చేయాలని ఏజెన్సీ సిబ్బందికి సూచించారు. గూడూరు ఎంఈఓ నాగరాజు వెంట ఉన్నారు.

హంద్రీనదిలో ముళ్ల చెట్లను తొలగించాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్ ప్రాంతం హంద్రీనదిలో పెరిగిన ముళ్లచెట్లను తొలగించాలని కేవీపీఎస్ నాయకుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం సమితి నాయకులతో కలిసి హంద్రీనదిని పరిశీలించారు. నదిలో ముళ్ల చెట్లు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారిందన్నారు.మరోవైపు స్థానికుల ఇళ్లలోని పాములు, తేళ్లు వంటి విషపురుగులు సంచరిస్తున్నాయని తెలిపారు. సచివాలయ, మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి ముళ్లచెట్లను తొలగించాలని కోరారు. నాయకులు సురేష్, వెంకటేష్, చిట్టిబాబు, రాజు, వెంకట్, సూరి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు: కర్నూలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కర్నూలు, పాణ్యం నియోజకవర్గాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశుసేవా పథక అధికారిణి అనురాధమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోపు బి.క్యాంపు, డీఐజీ బంగ్లా సమీపంలోని కర్నూలు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత, ఆయా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత అర్హతగా పేర్కొన్నారు. కర్నూలుకు సంబంధించి 5వ వార్డు వీబీ స్ట్రీట్–1 అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. ఆయా పోస్టులకు సంబంధించి 5వ వార్డు, వీబీ స్ట్రీట్–2 కేంద్రం, 46వ వార్డు, నరసింహారెడ్డి నగర్–2 కేంద్రం, 18వ వార్డు, జొహరాపురం–5 సెంటర్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు, ఇక పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి కార్యకర్త పోస్టు కల్లూరు మండలం, దొడ్డిపాడు అంగన్‌వాడీ కేంద్రం, ఆయా పోస్టులు 28వ వార్డు, లక్ష్మీపురం–1, 32వ వార్డు, ముజఫర్‌నగర్–2, 28వ వార్డు, పందిపాడు–2, 37వ వార్డు, వీకర్‌సెక్షన్ కాలనీ–1 కేంద్రాలు ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

'అన్నదాత పోరు'కు తరలివెళ్లిన నాయకులు



వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డితో కలిసి వెళుతున్న ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కోడుమూరు రూరల్: యూరియా కొరత.. రైతులెదుర్కొంటున్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కర్నూలులో మంగళవారం నిర్వహించిన «అన్నదాత పోరు» కార్యక్రమానికి నియోజకవర్గంలోని కోడుమూరు, గూడూరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, రైతులు భారీగా తరలి వెళ్లారు. కోడుమూరు నుంచి జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, సర్పంచు మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచు మాదులు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్టారెడ్డి, భీమిరెడ్డి, మండలాధ్యక్షులు రమేష్‌నాయుడు, ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు.

- గూడూరు నుంచి జెడ్పీటీసీ సభ్యుడు మౌలాలి, మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్లు పీఎన్ అస్లాం, లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ జి ల్లా ఉపాధ్యక్షుడు ఎల్.వెంకటేశ్వర్లు, మండల, ప ట్టణ అధ్యక్షులు రామాంజినేయులు, ఆబేలు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, రైతులు అన్నదాత పోరు కార్యక్రమానికి తరలివెళ్లారు.
- సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు మంగళవారం కర్నూలులో నిర్వహించిన «అన్నదాత పోరు» కార్యక్రమంలో సి.బెళగల్ మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ, నిరసన కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డితో పాటు నాయకులు ప్రభాకర్ రెడ్డి, సీబీ తులసిరెడ్డి, హారున్, మహానంది, మద్దిలేటి, వెంకటేష్, గోపాల్, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పులిరాజు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.
- కర్నూలు(రూరల్): మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కర్నూలులో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి నాయకులు, రైతులు, పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు మండల కన్వీనర్ మోహన్‌బాబు ఆధ్వర్యంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మండలాధ్యక్షురాలు డి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ నెహమ్యా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధికార ప్రతినిధి గౌతమ్, కోడుమూరు నియోజకవర్గ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు రామక్రిష్ణ యాదవ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు వినయ్‌కుమార్ రెడ్డి, యూత్ విభాగం అధ్యక్షుడు ఎమ్.కే.వెంకటేష్, ప్రచార విభాగం అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, మేధావుల ఫోరం అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ డి.వాసు, ఉల్చాల సర్పంచ్ విద్యాసాగర్, నిడ్జూరు సర్పంచ్ సంపత్‌కుమార్, నందనపల్లె సురేష్, ఎస్సీ సెల్ నాయకుడు సురేష్ తదితరులు పాల్గొని రైతుల పక్షాన గళమెత్తారు.


శిథిలావస్థలో ఓహెచ్ఆర్ ట్యాంకులు



బలపనూరు ప్రాథమిక పాఠశాల వద్ద శిథిలావస్థకు చేరుకున్న ట్యాంక్

గడివేముల: మండల కేంద్రంలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు ఇప్పటికీ వాడకంలో ఉండడం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. గడివేముల గ్రామంలోని బోల్లవరం రోడ్డులో ఉన్న ఈ ట్యాంకు సామర్థ్యం 60 వేల లీటర్లు. సాధారణంగా 20 ఏళ్ల వరకు మాత్రమే ఉపయోగించాల్సిన ట్యాంకు 40 ఏళ్లు గడుస్తున్నా ఇంకా వినియోగంలోనే ఉంది. ట్యాంకుకు ఉన్న పిల్లర్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయి. పైభాగం పెచ్చులూడిపోవడంతో ఎప్పుడు కూలుతుందోనన్న భయం ప్రజల్లో నెలకొంది. ట్యాంకు శుభ్రపరిచే సిబ్బంది కూడా ప్రాణభయంతో పైకి ఎక్కలేకపోతున్న పరిస్థితి ఉంది. పాత ట్యాంకును కూల్చి, కొత్త ట్యాంకు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న ఓహెచ్ఆర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి విద్యార్థులు, సిబ్బందిని భయాందోళనకు గురి చేస్తోంది. ట్యాంక్ పైభాగం పెచ్చులూడి కింద పడుతున్నాయి. ఏడాది క్రితం నీటిని పంపింగ్ చేయడం నిలిపివేశారు. అప్పటి నుంచి ట్యాంక్ పెచ్చులు ఊడిపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికే ట్యాంక్‌కు అమర్చిన నిచ్చెన, పైపులు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాఠశాలను ఆనుకుని ఉన్నందున పాఠశాల ఆవరణలోకి రావడానికి విద్యార్థులు భయపడుతున్నారు. ట్యాంక్ చుట్టూ చెత్త పేరుకుపోయింది. వీటి నుంచి విషసర్పాలు సంచరిస్తుంటాయని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గడివేముల: బోల్లవరం రస్తాలో కూలడానికి సిద్ధంగా ఓవర్‌హెడ్ ట్యాంక్



గార్గేయపురం సమీపంలో మొక్కజొన్న పంట చుట్టూ చీరలతో కంచె



పొగాకు నారుమడికి రక్షణగా కట్టిన చీరలు

పాత చీర.. పైరుకు రక్ష

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం, పడిదెంపాడు, పూడూరు గ్రామాలు అడవికి దగ్గరగా ఉండటంతో ఆయా గ్రామాల రైతులు పంటలను కాపాడుకునేందుకు పాత చీరలతో చుట్టూ కంచె ఏర్పాటు చేసుకున్నారు. అటవీ సమీప గ్రామాలు కావడంతో అడవి పందులు మొక్కజొన్న, కంది, జొన్న పంటలను తిని నాశనం చేస్తాయని, అలాగే పొగాకు నారుమళ్లలో వివిధ పక్షులు, జంతువులు చొరబడి తొక్కి నాశనం చేస్తాయని వాటి నుంచి పైర్లను కాపాడుకునేందుకు పాత చీరలతో పొలం చుట్టూ కంచె కట్టినట్లు చెప్పారు. రాత్రీ సమయాల్లో రంగురంగుల చీరలను చూసి బెదిరి అడవి పందులు పంట వైపు రాకుండా ఉంటాయని వారు చెబుతున్నారు. అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టి అడవి పందులు పొలాల్లోకి రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.